సాక్షి నారాయణపేట

శుక్రవారం । 2 । జూన్ । 2023



విద్యుత్‌కు డిమాండ్

రోజురోజుకు విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో డిమాండ్ ఏర్పడుతోంది.

వివరాలు 8లో ▸



ఎక్కడికక్కడే ధాన్యం..

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.9 /24.2

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

అభివృద్ధి పరుగులు

- సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు
- మిషన్ భగీరథతో తాగునీటి తిప్పలకు చెక్
- విద్య, వైద్యం, రవాణా రంగాల్లో జిల్లా ముందంజ
- చేనేత పట్టుచీరలు, బంగారు ఆభరణాల తయారీలో మరింత వృద్ధి
- ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్ని రంగాల్లో ముందుకు..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం, పేట జిల్లాగా ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతంలో అభివృద్ధికి భీజం పడినట్లయింది. సాగునీరందక బీడుబారిన పొలాలు సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల ద్వారా తిరిగి సాగులోకి వచ్చాయి. ఈ రిజర్వాయర్ల ద్వారా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరందుతోంది. జిల్లా ఆస్పత్రి.. పల్లెపల్లెకు బస్తీ దవాఖానాల ఏర్పాటుతో పేదలకు మెరుగైన వైద్యం చేరువైంది. మండలానికో ఇంటర్ కళాశాల, కొత్తగా మూడు డిగ్రీ కళాశాలలు.. మరెన్నో గురుకులాల ఏర్పాటుతో ఉన్నత విద్య విద్యార్థుల దరిచేరింది. మట్టి రోడ్లు కాస్తా.. బీటీ రోడ్లయ్యాయి. రూ.578 కోట్లతో మిషన్ భగీరథ పనులతో ఇంటింటికీ శుద్ధ జలం చేరగా.. ప్రజల దాహార్తి తీరింది. మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పల్లెలు కొత్త శోభ తెచ్చుకున్నాయి. తొమ్మిదేళ్ల ప్రత్యేక రాష్ట్రంలో అన్ని రంగాల్లో జిల్లా పరుగులు పెడుతోంది.




నారాయణపేట: తొమ్మిదేళ్ల క్రితం ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన ఇక్కడి ప్రజలు.. తిరిగి ప్రత్యేక జిల్లా కోసం 2019 వరకు నిరసనలు, ఆందోళనలతో కదం తొక్కారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నారాయణపేట నియోజకవర్గం నుంచి ఎస్.రాజేందర్‌రెడ్డిని గెలిపిస్తే జిల్లాను ఏర్పాటు చేస్తానని కేసీఆర్ హామీ ఇవ్వగా.. 2019 ఫిబ్రవరి 17న తన జన్మదిన కానుకగా నారాయణపేట జిల్లాను ఏర్పాటు చేశారు. నాటి నుంచి జిల్లాకు నిధులు, నీళ్లు, నియామకాలను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తు వస్తుంది.

ప్రజా సంక్షేమంలోనూ..

జిల్లాలో ఆసరా లబ్ధిదారులు 81,527 మందికి తొమ్మిదేళ్లగా రూ.1,15,623 అందించి అండగా నిలిచింది. షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం కింద 4,491 మందికి రూ.42 కోట్లు అందించింది. రైతుబంధు కింద 1.60 లక్షల మంది రైతులకు దాదాపు రూ.2 వేల కోట్లు సాయం అందింది. దళితబంధు పథకం కింద 187 మందికి రూ.10 లక్షల చొప్పున, దళితులకు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి పథకం కింద ధన్వాడ మండలంలోని కిష్టాపూర్‌లో 49 మందికి 2.15 ఎకరాల భూ పట్టాలను అందజేసింది. ప్రతి ఏటా మత్స్యశాఖ చేపలను చెరువుల్లో ఉచితంగా వదులుతుండడంతో 5వేల మంది మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి పొందుతున్నారు. జిల్లాలోని గొర్రెల కాపరులు ఎదిగేందుకు 9,877 యూనిట్లు మంజూరు చేసి లబ్ధిదారులకు ఇవ్వడం జరిగింది. అయితే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం అసంపూర్తిలో మిగిలిపోయింది.

ఒక్కో అడుగు..

జిల్లా కేంద్రంలో రూ.6 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ భవన సముదాయం అసెంబ్లీ 'సాక్షి' గా సీఎం మెచ్చుకొని ఎమ్మెల్యే ఎస్.ఆర్‌రెడ్డి అభినందించారు. రూ.47 లక్షలతో సఖి సెంటర్, రూ.4 కోట్లతో నిర్మించిన కొండారెడ్డిపల్లి మినీట్యాంక్ బండ్, రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా రూ.80 లక్షలతో నిర్మించిన సీనియర్ సిటిజన్ పార్కు. రూ.28 కోట్ల నిధులతో సత్యనారాయణ చౌరస్తా నుంచి మార్కండేయ దేవాలయం సమీపం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ, సైన్స్‌పార్కు, చిల్డ్రన్‌పార్కు, రూ. 62.10 కోట్లతో సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణం పనులకు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. రూ.38.50 కోట్లతో ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. పనులు వేగిరంగా కొనసాగుతున్నాయి.



నారాయణపేట కొండరెడ్డిపల్లి చెరువు మినీ ట్యాంక్ బండ్

ఉమ్మడి జిల్లాలో ప్రధాన ప్రాజెక్టుల వారీగా ఆయకట్టు వివరాలు

ప్రాజెక్టు	ఆయకట్టు		
	మొత్తం	2014	2023
జూరాల	1,04,741	68,084	1,04,741
కోయిల్‌సాగర్	50,250	12,000	38,250
రాజీవ్‌భీమ	2,03,000	12,000	1,58,000
ఆర్‌డీఎస్	87,500	23,344	87,500
నెట్టెంపాడు	2,00,000	2,500	1,42,000
కల్వకుర్తి	4,24,816	13,000	3,50,000
మొత్తం	10,70,307	1,30,928	8,87,491
మైనర్ ఇరిగేషన్	2,64,741	84,410	1,87,960
ఐడీసీ స్కీమ్‌లు	81,277	13,048	24,700
మొత్తం	14,16,325	2,28,386	11,00,151



రూ.6 కోట్లతో నిర్మించిన మార్కెట్ సమీకృత భవనం



కలెక్టరేట్ భవన సముదాయానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్

సాగు, తాగునీటిపై ప్రత్యేక దృష్టి

ఒకప్పుడు సాగు, తాగునీటికి ప్రజలు, రైతులు ఇక్కట్లు ఎదుర్కొనేవారు. అయితే, జిల్లా ఏర్పాటు అనంతరం ఈ రెండింటిపైనే ప్రత్యేకంగా దృష్టి సారించారు. మిషన్ కాకతీయలో భాగంగా చెరువులు, కాల్వలు తవ్వారు. ప్రధాన ప్రాజెక్టులకు వీటిని అనుసంధానం చేయడంతో అన్ని సీజన్లలో నీటి ఇక్కట్లు తప్పాయి. సంగబండ రిజాయ్యర్, భూత్పూర్ రిజార్వాయర్ల ద్వారా 1.10లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రతి ఏటా వానాకాలంలో, యాసంగిలో సైతం రైతుల పొలాలు కళకళలాడుతూ సిరులు పండుతున్నాయి. రూ.578 కోట్ల అంచనాతో మిషన్ భగీరథ పనులు చేపట్టి ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించారు. మక్తల్, మరికల్, నారాయణపేట నగర శివారులో మీనీ ట్యాంక్‌బండ్‌ల నిర్మాణంతోపాటు జిల్లాలోని 280 గ్రామ పంచాయతీలో పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, 77 క్లష్టర్లలో రైతువేదికలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే, పేట ఏరియా ఆస్పత్రి జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. చిల్డ్రన్ ఆస్పత్రి, డయాలసిస్‌సెంటర్, పల్లె, బస్తీ దవాఖనాల ఏర్పాటుతో రోగులకు మెరుగైన వైద్యం అందుతోంది. అలాగే, ఎస్ఎల్‌డీసీ కళాశాల ప్రభుత్వ పరం చేయడంతో పాటు కొత్త డిగ్రీకళాశాలలు ధన్వాడ, మక్తల్‌లో ఒక్కోటి ఏర్పాటైంది. ప్రతి మండలంలో జూనియర్ కళాశాలలు, సాంఘిక సంక్షేమ, మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల, ప్రతి గ్రామానికి ప్రధాన రహదారి నుంచి బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇక పేట చేనేత పట్టు చీరలకు దేశ విదేశాల్లో ప్రత్యేక ఖ్యాతి దక్కగా.. ఇక్కడి బంగారం వ్యాపారం ఎంతో వృద్ధి చెందింది.

రోల్‌మోడల్‌గా నిలుపుతాం..



సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్తుంది. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం 10 జిల్లాలుగా ఉన్న తెలంగాణను నేడు 33 జిల్లాలుగా చేశారు. నారాయణపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత ప్రజాసంక్షేమం, ప్రగతిలో పరుగులు పెడుతోంది. ఉద్యానవన, పట్టు పరిశ్రమ మార్కెటింగ్‌శాఖ, రైతుబంధు, కళ్యాణలక్ష్మి, ఆసరా పింఛన్, మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ, పశువైద్యం, మత్స్యశాఖ, వైద్యం ఇలా అన్ని రంగాల్లో జిల్లాను రోల్‌మోడల్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నాం.

– ఎస్.రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

రైతుల నీటి కష్టాలు దూరం చేశాం



నీరు, నియమాకాలు, నిధులే లక్ష్యంగా సాధించుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్‌లో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తు తొమ్మిదేళ్లుగా బంగారు తెలంగాణ దిశగా ప్రగతిలో పరుగులు తీస్తూ పదో వసంతంలోకి అడుగులు వేస్తోంది. జిల్లాలో సంగంబండ, భూత్పూర్ రిజ్వారయర్ల ద్వారా 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల నీటి కష్టాలు దూరం చేశాం. 150 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్ నిర్మించాం. 41 కొత్త గ్రామపంచాయతీలు, మూడు మున్సిపాలిటీలు ఏర్పడగా.. పాలనను ప్రజలకు దగ్గర చేశాం.

– చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, మక్తల్

ప్రజా సంక్షేమానికి కృషి



సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ప్రజాసంక్షేమం, ప్రగతిలో పరుగులు తీస్తుంది. ప్రజలకు పరిపాలన మరింత సౌలభ్యం చేసేందుకు జిల్లాలను ఏర్పాటు చేయడంతోనే నారాయణపేట జిల్లా ఏర్పాటు కావడం, జిల్లా పరిషత్ తొలి చైర్‌పర్సన్‌గా కావడం ఆనందంగా ఉంది. జిల్లాలో వ్యవసాయం, మిషన్‌కాకతీయ, మిషన్‌భగీరథ, విద్యుత్, స్వచ్ఛభారత్, హరితహారం ద్వారా ప్రజల సంక్షేమానికి విశేష కృషి జరిగింది.

– వనజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

న్యూస్‌రీల్

పోషణ్ అభియాన్ పక్కాగా అమలు చేయాలి



నారాయణపేట టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి శ్యామ్‌సుందర్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పత్తి బజార్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పోషణ్ అభియాన్ గురించి సమగ్ర సమాచారాన్ని, చిరు ధాన్యాలలో ఉండే పోషక విలువలపై తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు.అదే విధంగా మండలంలో కొల్లంపల్లి అంగన్‌వాడి కేంద్రంలో పోషణ్ అభియాన్ గురించి అంగన్‌వాడీ టీచర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహిళ మోర్చ పట్టణ ఉపాధ్యక్షురాలు సూర్యకళ, ప్రధాన కార్యదర్శి లలితా తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో పెద్దచెరువు వద్ద నిర్మిస్తున్న మినీ ట్యాంక్ బండ్, నెక్లెస్‌రోడ్డు, ఐలాండ్ పనులను గురువారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. మోద్రన్ రైతుబజార్ సమీపంలో నుంచి నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అలాగే మినీట్యాంక్ బండ్ సుందరీకరణ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేది వీరే..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శుక్రవారం అన్ని జిల్లాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించే వారి జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. వనపర్తి జిల్లాలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జోగుళాంబ గద్వాల జిల్లాలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు, నారాయణపేట జిల్లాలో రాష్ట్ర మహిళ కమిషన్ చైర్మన్ సునీతా లక్ష్మారెడ్డిలు జాతీయ జెండాలను ఆవిష్కరిస్తారు.

వేరుశనగ క్వింటా రూ.6,669

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగకి గరిష్టంగా రూ.6,669, కనిష్టంగా రూ.5,890 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్టంగా.1,827, కనిష్టంగా రూ.1,301, ఆముదాలు గరిష్టంగా రూ.5,375, కనిష్టంగా రూ.5,230, హంస రకం ధాన్యం గరిష్టంగా రూ.1,701, కనిష్టంగా రూ.1,201, ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ.2,279, కనిష్టంగా రూ.1,619 ధరలు లభించాయి.

ముగిసిన రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు

కందనూలు: మూడురోజుల పాటు కన్నుల పండువగా సాగిన శ్రీపురం శ్రీరంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు మహా పూర్ణాహుతి.. ధ్వజ అవరోహణం, పల్లకీసేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని చంద్ర పుష్కరిణిలో రంగనాయక స్వామివార్లకు చక్రతీర్థ స్నానం జరిపించారు. ఉత్సవ మూర్తులను పల్లకీసేవ ద్వారా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి స్వామివారి శంఖ చక్రాలకు కోనేరులో చక్రతీర్థ స్నానం చేయించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు కోనేరులో దిగి స్నానాలు ఆచరించారు. రాత్రి ద్వాదశ ఆరాధన, సప్తవర్ణాలు కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి.



పండుగలా ఉత్సవాలు నిర్వహించాలి



ధన్వాడ రైతు వేదికలో పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



దామరగిద్ద చెరువును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

ధన్వాడ: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పండుగల జరుపుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక, పెద్ద చెరువులను ఆయన పరిశీలించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై తొమ్మిదేళ్లు ముగిస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలనే ఆదేశాలను ఇవ్వడంతో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుల వద్ద గ్రామ రైతులు వనభోజనాలు నిర్వహించాలని, అలాగే రాష్ట్ర ఏర్పాటు అయినప్పటి నుంచి నేటివరకు సాధించిన ప్రగతి నివేదికలను ప్రజలకు చదివి వినిపించాలన్నారు. చెరువు సందర్శన కంటే ముందు రైతు వేదికలో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. రైతు వేదికలను తోరణాలతో ముస్తాబు చేయాలన్నారు. జూన్ 3న రైతు దినోత్సవం జరుపుకోవాలని ఇప్పటి వరకు అందించిన రైతుబంధు, రైతు బీమా, తదితర వివరాల ఫ్లెక్సీలు, 1000 మంది రైతులతో సభను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్, జెడ్పీ సీఈఓ జ్యోతి, ఎంపీడీఓ సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నిర్వహించాలి

దామరగిద్ద: గురువారం చేపట్టనున్న దశాబ్ది ఉత్సవ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యవేక్షించారు. స్థానిక రైతువేదికను, చెరువులను పరిశీలించారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలని కోరారు. ప్రత్యేక అధికారి డీఎల్‌పీఓ సుధాకర్‌రెడ్డి మండలంలోని అన్నసాగర్, బాపన్‌పల్లి తదితర రైతు వేదికలను పర్యవేక్షించారు. ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు.

పరేడ్ గ్రౌండ్‌లో ముమ్మర ఏర్పాట్లు



పరేడ్ ప్రాక్టీసు చేస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను అందంగా ముస్తాబు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు కావస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహిస్తున్న దశాబ్ది సంబరాలకు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. గురువారం ఏఎస్పీ నాగేంద్రుడు దగ్గరుండి అన్ని పనులు చేయించారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల ద్వారా సెర్మోనియల్ పరేడ్ ప్రాక్టీస్ చేశారు. అదేవిధంగా పట్టణంలోని ముఖ్య కూడళ్లు, బస్టాండ్, ప్రార్థన స్థలాల్లో బాంబు స్కాడ్ బృందం తనిఖీలు చేపట్టారు. ముందస్తు భద్రత చర్యలను చేపట్టినట్లు వివరించారు. ఇక జిల్లాలోని పోలీసు స్టేషన్లు, ఇతర కార్యాలయాలు విద్యుత్ దీపాలు, రంగురంగు కాగితాలతో ముస్తాబు చేశారు.

దశాబ్ది వేడుకలకు సర్వం సిద్ధం

- ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి
- 21 రోజుల పాటు కార్యక్రమాలు

నారాయణపేట: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష దిశానిర్దేశంతో జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. డుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునితా లక్ష్మారెడ్డి, విశిష్ట అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు.

నేటి కార్యక్రమాలు

శుక్రవారం ఉదయం 8.40 గంటలకు ముఖ్య అతిథి రాక, 8.45 గంటలకు అమరవీరులకు వందన సమర్పణ, 9 గంటలకు ముఖ్య అతిథిచే పతకా విష్కరణ, వందన స్వీకారం, 9.10 గంటలకు ముఖ్య అతిథి సందేశం, 10 గంటలకు కార్యక్రమ ముగింపు.



విద్యుత్ దీపాల వెలుతురుతో కలెక్టరేట్

విజయవంతం చేయాలి

జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 21 రోజుల పాటు సంబంధించి ముందస్తు ప్రణాళికలను రూపొందించి సంబంధించి శాఖల అధికారులతో పాటు స్పెషల్ అధికారులను కేటాయించి సాఫిగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రతి హామీని అమలు చేస్తాం

- బీఆర్ఎస్‌ను తరమికొట్టే రోజులొచ్చాయ్
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

లింగాల: ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి తీరుతుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మండలంలో గురువారం రెండో రోజు అవుసలికుంట నుంచి ప్రారంభమై మార్గమధ్యలో భోజన విరామం తర్వాత కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన కార్నర్ సమావేశంలో భట్టి మాట్లాడుతూ మరోసారి గెలిచి తీరుతామని బీఆర్ఎస్ కలలు కంటుందని, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఏకంగా 30 ఏళ్లు పాలిస్తానని ధీమా వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గువ్వల బాలరాజు ఇప్పటి నుంచి తన సొంత గ్రామానికి వెళ్లడానికి మూట ముల్లె సర్దుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ దోపిడీ, దొంగల రాజ్యంగా మారిందని, ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వంట గ్యాస్ సిలిండర్ రూ.500కే ఇస్తామని, ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, పోడు భూములకు పట్టాల అందజేత, అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు అన్ని రకాల నిత్యావసర సరకులు అందజేస్తామని, ప్రతి ఇంట్లో అర్హులైన భార్యాభర్తలకు ఆసరా పింఛన్లు ఇస్తామని ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి

కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని భట్టి పేర్కొన్నారు. పాదయాత్ర చేస్తున్న సమయంలో రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రోజుల తరబడి ఇలా రోడ్లపై ధాన్యం ఉంచుకోవాల్సి వస్తుందని, ధాన్యం విక్రయించినా సకాలంలో డబ్బులు రావడం లేదని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. అచ్చంపేట, కల్వకుర్తి లిఫ్ట్ నుంచి నీరు ఇవ్వాలని ప్రజలు అడుగుతుండగా.. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల నుంచి ఇస్తామని పదేళ్లుగా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలలో అంతర్భాగమైన వట్టెం, ఏదుల, నార్లాపూర్, ఉదండాపూర్, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లే ఇప్పటికీ పూర్తి కాలేదని, అచ్చంపేట నియోజకవర్గంలో నిర్మిస్తామంటున్న చెన్నకేశవ, ఉమామహేశ్వర లిఫ్టులకు ఎక్కడి నుంచి నీళ్లు తెస్తారు.. ఎప్పుడు పూర్తి చేస్తారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, ఎంపీపీ లింగమ్మ, వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగేశ్వర్ రావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

క్లుప్తంగా

పాముకాటుతో యువరైతు మృతి


మృతిచెందిన శ్రీనివాస్‌రెడ్డి

తాడూరు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని నాగగదేవ్‌పల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన జక్క శ్రీనివాస్‌రెడ్డి (39) యువరైతు వారం రోజుల క్రితం పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా.. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లోకేశ్వరితో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానవపాడు: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య కథనం ప్రకారం.. మండలంలోని బోరవెల్లికి చెందిన పరశురాముడు(22) మానవపాడుకు బైక్‌పై వెళ్తుండగా.. ఉండవెల్లి మండలం బైరాపురం గ్రామానికి చెందిన లాల్‌నాయుడు, నాగన్న మానవపాడు శివారు ప్రాంతంలోని శివాలయం దగ్గర ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన పరశురాముడు చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ ఘటనపై పరశురాముడు తల్లి బీసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పిడుగు పాటుకు గురై యువకుడు..

భూత్పూర్: పిడుగుపాటుకు ఓ యువకుడి మృతి చెందిన సంఘటన భూత్పూర్ మండలం పోతులమడుగు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం అడ్డాకుల మండలం వర్నెకు చెందిన ఉప్పరి ఆశోక్ (30), బంధువు ధన్వాడ మండల కాంసన్‌పల్లికి చెందిన ఉప్పరి గోపాల్‌తో కలిసి వర్నె నుంచి హైదరాబాద్‌కు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ఆకస్మాత్తుగా వర్షం రావడంతో భూత్పూర్ మండల పోతులమడుగు సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్టు కింద నిలబడ్డారు. ఆ సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో ఆశోక్ అక్కడికక్కడే మృతి చెందగా, గోపాల్ స్పృహ తప్పి పడిపోగా చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న భూత్పూర్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి..

మహమ్మదాబాద్: నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బోర్లాపడి మృతిచెందిన సంఘటన గండేడ్ మండలకేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. గండేడ్‌కు చెందిన బోయిని శ్రీశైలం (38) కొంతకాలంగా వలసకూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం గండేడ్ గ్రామానికి వచ్చి కుటుంబీకులను కలిసి తిరిగి సాయంత్రం వేళలో స్టేజీ దగ్గరకు రోడ్డు పైకి వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు బోర్లాపడ్డాడు. గాయాలతో రోడ్డుపై ఉన్న అతడిని స్థానికులు దగ్గరిలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పడంతో..

వనపర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం వనపర్తి మండలం అంజనగిరి గ్రామ శివారులో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ రామరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తిలో నివాసం ఉంటున్న రిషి వర్మ(19) ఆతని స్నేహితుడు బి.అర్జున్‌లు పాన్‌గల్ మండల కేంద్రానికి సమీపంలోని బారాపీర్ల దర్గా వద్దకు వెళ్లి తిరిగి బైక్‌పై బయల్దేరారు. అంజనగిరి శివారులోని వస్తుండగా బైక్ అదుపుతప్పి టాయిలెట్ గోడకు ఢీ కొట్టడంతో రిషి వర్మ అలియాస్ నాని అక్కడికక్కడే మృతి చెందగా.. అర్జున్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


శివ (ఫైల్)

కల్వకుర్తి రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. మండలంలోని గుడిపల్లికి చెందిన శివ(20) మార్చాల శివారులో ఏర్పాటు చేసిన కారు షెడ్‌లో కార్లు మరమ్మతు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం షెడ్‌లో పనిచేస్తుండగా షార్ట్‌సర్క్యూట్ కావడంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

విద్యుత్ వినియోగానికి డిమాండ్


బాదేపల్లి సబ్ స్టేషన్

- జడ్చర్ల డివిజన్‌లో ప్రతి ఏటా 12 శాతం పెరుగుదల
- వేసవిలో అదనంగా 10 శాతం అవసరం
- చివరి మూడు నెలల్లో ప్రతిరోజూ 4.1 మిలియన్ యూనిట్ల వాడకం

జడ్చర్ల టౌన్: జడ్చర్ల విద్యుత్ డివిజన్ పరిధిలో రోజుకు రోజుకు విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. అసలే వేసవికాలం ఆపై ఎండలు మండుతుండటంతో వినియోగం పెరుగుతూ వస్తోంది. డివిజన్ పరిధిలో 2021–22 ఏడాదిలో వ్యవసాయం, పరిశ్రమలు, ఇతరుల విభాగంలో 1,308 మిలియన్ యూనిట్లు వినియోగించగా.. 2022–23 మే నెలాఖరు వరకు 12 శాతం అధికంగా అంటే 1,489 మిలియన్ యూనిట్లు వినియోగించారు. 2021–22 వరకు ఐదేళ్లపాటు ప్రతి ఏటా విద్యుత్ 10 శాతం పెరుగుదల ఉండగా.. 2022–23 ఏడాదికి 1 2శాతానికి చేరుకుంది. వేసవికాలం మార్చి, ఏప్రిల్, మే నెలలో 10 శాతం అదనపు విద్యుత్ ప్రతిఏటా ఖర్చు అవుతోంది.

■ విద్యుత్ డివిజన్ పరిధిలో జడ్చర్ల, రాజాపూర్ సబ్‌డివిజన్లు ఉన్నాయి. జడ్చర్ల టౌన్, రూరల్, మిడ్జిల్, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాలు జడ్చర్ల సబ్‌డివిజన్ పరిధిలోకి వస్తాయి. బాలానగర్, రాజాపూర్, నవాబుపేట మండలాలు రాజాపూర్ సబ్‌డివిజన్ కింద ఉన్నాయి. డివిజన్ మొత్తంలో 33 కేవీ సబ్‌స్టేషన్లు 40 ఉండగా.. 132 కేవీ సబ్‌స్టేషన్లు 8 ఉన్నాయి. 33 కేవీ ఫీడర్లు 23 కాగా.. 11 కేవీ ఫీడర్లు 151 పని చేస్తున్నాయి. ఈ ఏడాది వ్యవసాయం కోసం అదనంగా 185 25కేవీ 3ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా.. గిరిజన తండాలకు 110 24కేవీ సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభించారు. పట్టణాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గాను 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 12 ఏర్పాటు చేశారు.


సబ్‌స్టేషన్‌లో అధిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు తీసుకొచ్చిన బ్రేకర్

వేసవిలో భారీగా వినియోగం

సాధారణంగా జడ్చర్ల విద్యుత్ డివిజన్ పరిధిలో ప్రతిరోజూ వ్యవసాయం, పరిశ్రమలు, గృహాలు, ఇతర అన్ని కలిపి 3.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉండగా.. వేసవి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రం ప్రతిరోజూ 4.1 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారు.

గత ఏడాదికన్నా 12 శాతం పెరుగుదల

2021–22 ఏడాదితో పోలిస్తే 2022–23 ఏడాదిలో 12 శాతం విద్యుత్ వినియోగం పెరిగింది. 2021–22లో వ్యవసాయం, పరిశ్రమలు, గృహ ఇతర వినియోగం మొత్తం 1,308 మి.యూనిట్లు కాగా.. 2022–23 ఏడాదిలో ఏకంగా 1,489 యూనిట్లకు చేరుకుంది. వేసవి ప్రారంభం కాగానే.. సరఫరాలో 12 శాతం డిమాండ్ పెరుగుతుంది. డివిజన్ పరిధిలో ప్రతిరోజూ 3.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం ఉండగా.. వేసవిలో మాత్రం 4.1 మిలియన్ యూనిట్లు అవసరం ఉంటుంది.

– కృష్ణమూర్తి, డీఈ, జడ్చర్ల విద్యుత్ డివిజన్

వ్యవసాయం, పరిశ్రమల్లో భారీగా..

వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర వినియోగంలోనూ ప్రతి ఏటా భారీగా పెరుగుదల కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో 2017–18 ఏడాదిలో కేవలం 192 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా.. 2022–23 ఏడాదికి 418 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. ఇక పరిశ్రమల విషయానికి వస్తే 2017–18 ఏడాదిలో 480 మిలియన్ యూనిట్ల వినియోగం కాగా.. 2022–23 ఏడాదిలో ఏకంగా 595 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. గృహ, ఇతర వినియోగం విషయానికి వస్తే 2017–18లో 348 మిలియన్ యూనిట్లు అవసరం రాగా.. 2022–23 ఏడాదిలో 476 మిలియన్ యూనిట్లకు పెరిగింది.

ప్రతి ఏటా విద్యుత్ వినియోగం పెరుగుదల ఇలా..
(విద్యుత్ వినియోగం మిలియన్ యూనిట్లలో)

సంవత్సరం	వ్యవసాయం	పరిశ్రమలు	ఇతరులు	మొత్తం
2017-18	192	480	348	1,020
2018-19	204	516	360	1,080
2019-20	228	504	386	1,116
2020-21	300	492	396	1,188
2021-22	348	540	420	1,308
2022-23	418	595	476	1,489

వేధింపులు భరించలేక మహిళ బలవన్మరణం

- మొదటి భార్యతో కలిసి భర్త చిత్రహింసలు
- ఫిర్యాదు తీసుకోని పోలీసులు
- నిందితుడిని శిక్షించాలని బంధువుల ఆందోళన


పద్మ (ఫైల్)

అమరచింత: మొదటి భార్యతో కలిసి రెండో భార్యను చిత్రహింసలకు గురిచేయడంతో భరించలేని ఆమె పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన కుర్వ మంగనారాయణ, ఇందిరమ్మలకు పెళ్లి జరిగి 12 ఏళ్లు గడిచినా పిల్లలు పుట్టలేదు. దీంతో చిన్నచింతకుంటకు చెందిన కుర్వ స్వాతి అలియాస్ పద్మ(36)ను నారాయణ పెద్దల సమక్షంలో రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో వారికి శివ, లావణ్య సంతానం కలిగారు. శివ ప్రస్తుతం ఆరో తరగతి తుఫ్రాన్‌లోని గురుకులంలో చదువుతుండగా.. లావణ్య ఐదో తరగతి చదువుతుంది. అయితే పిల్లలు పుట్టి పెరుగుతుండటంతో రెండో భార్య పద్మను ఇంటి నుంచి పంపించాలని భర్త నారాయణ, మొదటి భార్య ఇందిరమ్మ తరచూగా పద్మతో గొడవ పెట్టుకుని చిత్రహింసలకు గురిచేసేవారు. ఈ క్రమంలోనే గత నెల తమ వ్యవసాయ పొలంలో పద్మను నారాయణ, ఇందిరమ్మ చెట్టుకు కట్టి కొట్టారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. నాలుగు రోజుల క్రితం పద్మను చిత్రహింసలకు గురిచేసి బలవంతంగా నోట్లో పురుగు మందు తాగించారని సోదరులు శివ, రాజు వెల్లడించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పద్మను ఆస్పత్రిలో చేర్పించిన విషయాన్ని సైతం పద్మ కుటుంబ సభ్యులకు చెప్పకుండా దాచగా.. మృతిచెందడంతో తమకు తెలిసిందని వాపోయారు. తమ అక్క చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు తీసుకోలేదని ఆరోపించారు. దీంతో గ్రామంలో నారాయణ ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. రెండు గ్రామాల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి.. పద్మ పెళ్లి సమయంలో ఇచ్చిన రూ.75 వేల కట్నంతోపాటు రెండున్నర తులాల బంగారం తిరిగి ఇవ్వాలని తీర్మానం చేశారు. నారాయణను కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

సెల్ఫీ వీడియోతో వెలుగుచూసిన..

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

- భూ వివాదమే కారణమంటున్న బాధితులు
- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



లింగాల: తాము ఆత్యహత్య చేసుకుంటున్నట్లు భార్యాభర్తలు తీసిన సెల్ఫీ వీడియో వైరల్ అయ్యింది. భూ వివాదంలో ఓ కుటుంబం ఆత్యహత్యాయత్నం చేసుకున్న సంఘటన గురువారం మండలంలోని సూరాపూర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన కురుమూర్తి, భార్య శివలీల గత నెల 29న గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో పురుగు మందుతాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు తెలియడంతో వెంటనే ఆస్పత్రికి తరలించగా.. ప్రస్తుతం వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిసింది. కాగా తమ చావుకు కారణం ఎవరనేది కురుమూర్తి సెల్ఫీ వీడియోలో తెలపడం, ఈ వీడియోను గోప్యంగా ఉంచడం, చివరికి బయటకు రావడంతో సమస్య బహిర్గమైంది. గ్రామానికి చెందిన కొందరు 15 ఎకరాల భూమిని బలవంతంగా తీసుకొని కోర్టులో వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధరణిలో పేర్లను మార్పు చేయడంతో మనస్తాపానికి గురైనవారు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని సమాచారం. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు

- నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం వద్ద పోలీసు పహారా


నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం వద్ద గుమిగూడిన కార్యకర్తలు

గద్వాల క్రైం: ధరూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డిని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకుడి అనుచరులు దాడి చేసిన కేసులో గురువారం జిల్లా కేంద్రంలో హైడ్రామా కొనసాగింది. ఈ కేసులో 13 మందిని గుర్తించగా.. తాజాగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అయితే విషయం తెలుసుకున్న కార్యకర్తలు జిల్లాకేంద్రంలోని (ఎన్‌హెచ్‌పీఎస్) కార్యాలయానికి పెద్దఎత్తున చేరుకున్నారు. దాడి కేసులో పార్టీ నాయకుడిని సైతం పోలీసులు అరెస్టు చేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఉదయం 11.40 గంటల సమయంలో అక్కడికి చేరుకోగా గందరగోళం నెలకొంది. పెద్దఎత్తున చేరుకున్న కార్యకర్తలు అక్కడే వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఈ విషయమై గద్వాల సీఐ చంద్రశేఖర్‌ను 'సాక్షి' వివరణ కోరగా దాడి కేసులో నిందితులైన వారిని అదుపులోకి తీసుకోలేదని, ముందస్తు చర్యల్లో భాగంగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఎస్సీ హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ హాస్టల్‌లలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు ఒక ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఎస్టీ గురుకులాల్లో ప్రవేశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఎస్టీ కళాశాల గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఎస్టీ గురుకుల ప్రిన్సిపాల్ రాగలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో బాలికల కోసం మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, వనపర్తి, అచ్చంపేట, కేటీదొడ్డి, బాలుర కోసం కొండాపూర్, పెద్దమందడి, మన్ననూర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలతో పాటు ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

వానాకాలం పంటల సాగుకు సన్నద్ధం

- వానకాలం పంట సాగుకు సన్నద్ధం


పొలం దుక్కిదున్నతున్న దృశ్యం

అలంపూర్: వానాకాలం సీజన్‌లో పంట సాగు సకాలంలో జరగాలంటే ముందు నుంచే రైతులు సన్నద్ధం కావాల్సి ఉంటుంది. ఇందుకోసం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పనుల గురించి వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ వివరించారు.

దుక్కులు దున్నడం..

ముందస్తు దుక్కులు దున్నడం వలన తొలకరి వర్షాలకు భూమి నీటిని పీల్చుకొని తేమ శాతం పెరగడానికి దోహదపడుతుంది. వాలుకు అడ్డంగా దున్నే దుక్కిలతో వర్షపు నీరు ఒకవైపు వెళ్లకుండా నేల కోతను ఆరికడుతుంది. తోటల్లో ఉండే మొండి జాతి కలుపుమొక్కలు, దుంపలు వేళ్లతో సహా బయటికి ఊడి వస్తాయి. దీనికి తోడు నిద్రావస్థలో ఉన్న పలు కీటకాలు నశిస్తాయి. సేంద్రియ ఎరువులైన పశువు పేడ, వర్మికం పోస్టులను పొలాలకు తరలించాలి.

భూసార పరీక్షలు..

భూమిలో పోషక విలువలు తగ్గిపోయి పంటల్లో సూక్ష్మ పోషక లోపాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈనేపథ్యంలో భూసార పరీక్షలు చేయించాలి. ఏడాదికి ఒకటి రెండు పంటలు పండించే భూముల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షకేంద్రాల్లో అందజేయాలి. వారి సూచన మేరకు పంట సాగు చేసుకోవడం మంచిది.

చౌడు భూములను బాగు చేసుకోవడం..

భూగర్భ జలాలను విడివిడిగా వాడటంతో నీటిలోని క్లోరైడ్ ద్వారా పొలాలు చౌడు భూములుగా మారుతాయి. భూసార పరీక్షలను అనుసరించి చౌడు భూములను వ్యవసాయ యోగ్య భూములుగా మార్చేందుకు వేసవికాలం అనువైన సమయం. ఎండకాలంలో నేల పైకి పొంగి ఉన్న ఉప్పు చౌడును పారలతో గీకివేయాలి. మురుగు నీరు పోయేలా ఏర్పాటు చేసుకోవాలి. పొలాన్ని చదును చేసి దాదపు 20–25 సెంట్ల మడులను విభజించి గట్టు వేయాలి. కారు చౌడు నేలలు ఎండినప్పుడు గడ్డపార వేసిన పెకలక రాయి వలే ఉంటుంది. తగినంత నీరు, తేమ ఉన్నప్పుడు మొత్తటి, చిక్కటి బురద తయారవుతుంది. ఇలాంటి నేలలను వేసవిలో బాగు చేసుకోవచ్చు.

పచ్చి రొట్ల పైర్ల సాగు..

తొలకరి వర్షాలకు జనుము, జిలుగు, పిల్లి పెసర, అలసంద మొదలగు పంటలను పండించి భూమిలో చల్లి ఉండాలి. దీంతో ఎకరాకు 25–30 కిలోల యూరియాను ఆదా చేసుకోవచ్చు. భూమి ఆరోగ్యంగా ఉంటుంది. జనుము, పల్లి పెసరలు ఎరువులుగానే కాకుండా పశువుల మేతగా ఉపయోగపడుతుంది.

పొలం గట్ల తయారీ..

పంటలపై తీసుకోనే శ్రద్ధ పొలం గట్లు, మురుగు కాల్వలపై చూపించడం లేదు. వీటిలో వివిధ రకాలైన వయ్యారి భామ, మూల మాతంగి, నీరు గొబ్బి, గొంగల గరాకు, గరక రాకసి, తుంగ వంటి మొక్కలు పంటలతో పాటు పెరిగే వివిధ రకాలైన వ్యాధులు వచ్చేందుకు పురుగుల వ్యాప్తికి కారమవుతాయి. వేసవిలోనే తప్పనిసరిగా పొలం గట్లు, మురుగు కాలువల్లో కలుపు లేకుండా చూసుకోవాలి.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక..

తాలు గింజలు, సగం నిండని గింజలు, కలుపు విత్తనాలు, వేరు చేసి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. సర్టిఫైడ్ విత్తనం కాని, పరిశోధన స్థానాల నుంచి సేకరించిన విత్తనాలను తీసుకోవాలి. ఏ విత్తనమైన మొలక శాతం తెలుసుకోకుండా నారు పోయకూడదు. ఎంపిక చేసిన విత్తనాలను తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసి, 12 గంటల తర్వాతే విత్తనాన్ని భూమిలో నాటాలి.

ఎక్కడికక్కడే ధాన్యం..

- తరలింపులో జాప్యం చేస్తున్న అధికారులు
- రోజుల తరబడి సాగుతున్న కొనుగోలు ప్రక్రియ
- అకాల వర్షాలతో నష్టపోతున్న రైతులు


రాణిపేటలో రోడ్లపై ధాన్యం కుప్పలు

మిడ్జిల్: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతులు అకాల వర్షాలకు నష్టపోగా.. ప్రస్తుతం చేతికొచ్చిన కాస్త ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడంలో ఆలస్యం చేస్తుండటంతో నష్టపోవాల్సి వస్తుంది. మండల కేంద్రంతో పాటు రాణిపేట, అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల, కొత్తూరులో నేటికీ రైతులు పండించిన ధాన్యం కుప్పలు రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. ఇప్పటి వరకు మండలంలో సహకార సంఘం ద్వారా 90 వేల బస్తాలు కొనుగోలు చేయగా.. రైతుల దగ్గర దాదాపు అదే స్థాయిలో ధాన్యం నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో నిత్యం కొనుగోలు కేంద్రాల దగ్గరకు రైతులు క్యూ కట్టి పడిగాపులు కాసినా లారీల సమస్య వలన మండలంలో ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయింది. తరలించిన ధాన్యం కూడా లారీకి 25 నుంచి 35 బస్తాల వరకు మిల్లర్లు కోతలు విధిస్తున్నట్లు మండల రైతులు వాపోతున్నారు. వడ్లు ఎండిన తర్వాత కూడా కోత పెడుతుండటంతోపాటు బిగ్రేడ్ కింద రైతులకు క్వింటాకు రూ.2,040 మాత్రమే చెల్లిస్తున్నారు. తూకం వేసి 20 నుంచి 30 రోజుల అవుతున్న బస్తాలను తరలించకపోవడంతో అకాల వానలకు మొలకలు వస్తుండడం, కోతలు మరింత పెంచుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. కేఎల్ఐ కాల్వ నీరు మధ్యలో బంద్ చేయడంతో పంట సాగు చేసిన రైతులు పంట చేతికి వచ్చే దశలో దాదాపు 40 శాతం నష్టపోగా.. ఇప్పుడు పండించిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో నష్టం మరింత ఎక్కువ అవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోదిక్కు పంట సాగుకు తెచ్చిన పెట్టుబడికి వడ్డీలు పెరుగుతుండటంతో రైతులు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం త్వరగా కోతలు లేకుండ వరి ధాన్యం కొనుగోలు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.


మిడ్జిల్‌లో రోడ్లపైన ఇలా..

45 రోజులైంది..



దాదాపు 20 ఎకరాల్లో వరి పంట కోసి 45 రోజులు అవుతుంది. ఇప్పటి వరకు వానకు మూడుసార్లు వడ్లు తడిసిపోవడంతో ఆరబెట్టడం కోసం కూలీలే రూ.30 వేల ఖర్చు అయింది. ప్రతిరోజు వడ్ల కొనుగోలు కేంద్రం చుట్టూ తిరుగుతున్నా.. రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ ధాన్యం కొనడం లేదు.

– చంద్రమోహన్‌రెడ్డి, రైతు, కొత్తూరు

ధాన్యం తడుస్తుంది..



పంట కోసిన తర్వాత 30 రోజులకు బస్తాలు ఇచ్చారు. ధాన్యం తూకం వేసి 15 రోజులు అవుతున్న ఇప్పటికీ తరలించలేదు. దీంతో ప్రస్తుతం అకాల వానలకు ధాన్యం తడుస్తుంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరగా వడ్ల బస్తాలను తరలించాలి.

– భూపాల్‌రెడ్డి, రైతు, మల్లాపూర్

అన్‌లోడింగ్ కాక ఆలస్యం..



మిల్లుల దగ్గర లారీలు అన్‌లోడింగ్ కాకపోవడంతో ఆలస్యమవుతుంది. ఇక్కడి నుంచి లారీల్లో వడ్ల బస్తాలను తరలించిన తర్వాత మిల్లుల దగ్గర అన్‌లోడింగ్ చేయడం లేదు. ఇప్పటి వరకు దాదాపు 90 వేల బస్తాలను తరలించాం. ఇంకా దాదాపు 40 శాతం వడ్లు తరలించాల్సి ఉంది. నిత్యం అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– బాల్‌రెడ్డి, సహకార సంఘం సీఈఓ, మిడ్జిల్